క్లుప్తంగా

మావుళ్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



మావుళ్లమ్మ ఉత్సవంలో గరగలతో ఆసాదులు

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. మావుళ్లమ్మ నిలబెట్టి, ఆసాదులు గరగ నృత్యాలతో గ్రామంలోని గరగాలమ్మ, సోమాలమ్మ, పోతురాజు ఆలయాలకు నైవేధ్యాలు సమర్పించారు. ఈ నెల 4న మావుళ్లమ్మ జాతర, 5,6,7 తేదీల్లో తీర్థం నిర్వహిస్తామని, మంగళవారం భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

పెనుగొండ: డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం పెనుగొండలో మానవత ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఆర్‌కే విల్లాలో ఉదయం 9 గంటల నుంచి భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.రామచంద్రరాజు, డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, మేడపాటి షాలినీ రెడ్డి, డాక్టర కేఎస్ చైతన్య రామ్, డాక్టర్ కొమ్మిరెడ్డి ప్రియాంకలు పాల్గొంటారని తెలిపారు. దంత సమస్యలు ఉన్నవారు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేద పాఠశాలలో దరఖాస్తు గడువు జూలై 5

ఆకివీడు: మండలంలోని అయిభీమవరంలో శ్రీవేంకటేశ్వర వేద విద్యాలయంలో వేదం నేర్చుకునేందుకు జూలై 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ వారణాసి సుబ్రహ్మణ్యం ఆదివారం చెప్పారు. గతంలో వేదం నేర్చుకొని మానేసిన వారు, కొత్తగా వేదం నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న బ్రాహ్మణ వేద విద్యార్థులకు సువర్ణావకాశమని ఆయన అన్నారు. వేద పాఠశాలలో చతుర్వేదాలను బోధిస్తారని తెలిపారు. వేదం నేర్చుకునే బాలురు అక్షర పరిజ్ఞానంతోపాటు 9 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సూరంపూడి వెంకట రమణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 145వ నెలవారి సభా కార్యక్రమం ఆదివారం రాత్రి ఆర్టీసీ డిపో సమీపంలోని వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణలు పర్యవేక్షించారు. పెదవెల్లమిల్లికి చెందిన వాస్తు పండితులు దండమూడి సత్యనారాయణకు గౌరవ సత్కారం, భీమవరానికి చెందిన సాయి ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వాహకులు తమిరి సాంబమూర్తికి కళా సత్కారం, కొమ్ముగూడెం వ్యాయమ ఉపాధ్యాయులు కొత్త సుభద్రకు ఉద్యోగ సేవా పురస్కారం, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ భజన కళాకారుడు ఇసరపు అబ్బులకు ఆర్థిక సత్కారం చేశారు. కళాకారుల ఆపాత మధురాలు సినీ సంగీత విభావరి నిర్వహించారు.

సార్వా సాగు ఆలస్యం



మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్పలో చేలో నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: మండలంలోని శివారు ప్రాంతాల్లో ఈ ఏడాది సార్వా సాగు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కాలువలు వదిలినా మొగల్తూరు ప్రధాన కాలువలో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో వ్యవసాయ భూములకు నీరు అందడం లేదు. ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తున్నా శివారు ప్రాంతమైన మొగల్తూరు కాలువలో గుర్రపుడెక్క, చెత్త, చెదారాలు నిలిచిపోవడంతో కాలువలోని నీరుదిగువకు ప్రవహిచడంలేదు. మరోవైపు వరుణుడు కూడా కరుణించకపోవడంతో చేలు తడవడక దుక్కులు దున్నే పరిస్థితి కనిపించడంలేదు. గత నాలుగు రోజులుగా సుమారు 61.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసి చేలల్లో నిలిచిపోవడంతో రైతులు దుక్కులు దున్నేందుకు సిద్ధమవుతున్నారు. మండంలోని 17 గ్రామాలకు సంబందించి 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటి వరుకు మొగల్తూరులోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, రామన్నపాలెంలో కొన్ని ప్రాంతాలలో కేవలం 30 ఎకరాలలో మాత్రమే ఆకుమడులు వేశారని అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు కూడా గ్రామాల్లో పర్యటించి రైతులతో సమావేశమవుతున్నారు.

సాగు చేసే రకాలివే..

రైతులు ఎంటీయూ స్వర్ణ 7029,1061ఇంద్ర, 1064 అమర,1262 మార్టేరు మసూరి, ఎంటీయూ 1318 శీతాకాలం సన్నాలు వినియోగించాలని సూచిస్తున్నారు. లోతట్టు పంట చేలకు 1100 బాడవ మసూరి, ఎంటీయూ 1140 భీమా, ఎంటీయూ 1064 అమర, ఎంటీయూ 1172, ఎంటీయూ 1318 వంటివి అనుకూలంగా ఉంటాయన్నారు. చవుడు భూములకైతే ఎంటీయూ 1293 విత్తనాలు అనుకూలంగా ఉంటాయని వాటిని వినియోగించాలని రైతులకు సూచిస్తున్నారు. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురవాలని లేదా కాలువ ద్వారా పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తే సాగు పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు పేర్కొంటున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తుల అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షించారు.

ఘనంగా ఆషాఢమాస జాతర



గ్రామదేవతల జాతరలో సమర్పించిన నైవేద్యం

వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసియున్న గ్రామ దేవతలు శ్రీ మావుళ్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు స్వాములకు ఆదివారం ఆషాఢ మాస జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగలను పూరి గుడిసెలోకి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు పుట్టింటివారి నుంచి నైవేథ్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, సర్పంచ్ గెడ్డం భారతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్ర మూర్తి, మాజీ సర్పంచ్ కౌరు భాస్కరరావు, తోట విజయ్‌కుమార్, ఎం దుర్గాప్రసాద్, కౌరు రామగోపి, శీలబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

తీరంలో విస్తరిస్తున్న వైద్యసేవలు



అద్దంకి విజ్ఞాని



సీతాశ్రీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి

నరసాపురం: తీర ప్రాంతంలో వైద్య సేవలు ఇటీవల కాలంలో బాగా విస్తరిస్తున్నాయని, నరసాపురం కోవెల వీధిలో ప్రారంభించిన సీతాశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉన్నత ప్రమాణాలతో వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆ ఆస్పత్రి డాక్టర్, గైనకాలజిస్ట్ అద్దంకి విజ్ఞాని తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరుకు చెందిన ముగ్గురు డాక్టర్లు గుబ్బల జితేంద్ర చైతన్య, అద్దంకి శివరామ కృష్ణ, అద్దంకి విజ్ఞాని కలిసి సంయుక్తంగా ఈ ఆసుపత్రి నెలకొల్పామని తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, స్త్రీల సమస్యలకు సంబంధించి గైనకాలజీ విభాగాలు అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేశామన్నారు. ఆక్వా రైతు గుబ్బల నారాయణమూర్తి వారసులుగా సేవా దృక్పథంతో ఆసుపత్రి ప్రారంభించినట్లు వివరించారు.

డ్రెయిన్లపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఆకివీడు: కొల్లేరులో ఐదవ కాంటూర్ దిగువ ప్రాంతంలోని డ్రెయిన్ల తవ్వకం పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఉమ్మడి జిల్లా డీఎఫ్ఓ హిమ శైలజ చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామ శివారు ప్రాంతంలోని ఐదవ కాంటూర్ దిగువ ప్రాంతాల్లోని డ్రెయిన్లను ఆదివారం ఆమె పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కాంటూర్ పరిధిలోని బీదర సేడు, పాత వయ్యేరు, అవిశా కాలువ, పాత ఏరు, తదితర డ్రెయిన్లు పూడుకుపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి మురుగు నీరు, వర్షపు నీరు ఉప్పుటేరులోకి ప్రవహించట్లేదని చేసిన ఫిర్యాదు మేరకు ఆయా డ్రెయిన్లను పరిశీలించినట్లు ఆమె వివరించారు. గత కొన్నేళ్లుగా ఆయా డ్రెయిన్లు తవ్వకపోవడంతో నీటి ప్రవాహం మందగించి, ఎగువ ప్రాంతం నుంచి మురుగు నీరు చొచ్చుకొచ్చి దిగువనున్న పంట పొలాలను ముంచుతున్నాయని, ఎగువ ప్రాంతంలోని పంట పొలాలు కూడా ముంపునకు గురవుతున్నాయని రైతులు డీఎఫ్ఓకు వివరించారు. దీనిపై సమగ్ర నివేదికను రాష్ట్ర అధికారులకు పంపుతానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు తమ సమస్యల్ని వివరించారు.

సేవ చేయడం అదృష్టం



ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో మంత్రి నిమ్మలను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలకు సేవ చేయాలన్నా అందరికి సాధ్యం కాదని అది కూడా ఒక అదృష్టంగానే భావించాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎంకెఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ వీరా సతీష్ ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులకు సన్మానం చేశారు. సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైద్యులు, చేగొండి ప్రభాకర్, గందం ఏసుపాధం, మంతెన గోపాలం, ప్రకాష్, తాడి శ్రీనివాసు, కాపిశెట్టి సోంబాబు, మార్నెళ్ల వెంకటేశ్వరరావు, బదరీ నారాయణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పాలకొల్లు అర్బన్: గతంలో వివిధ కారణాలతో రద్దు చేసిన పింఛన్లను పునః పరిశీలన చేసిన అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పింఛన్ల పంపిణీపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారుల ఇంటివద్దకే అధికారులు వచ్చి నగదు అందజేస్తారన్నారు.

పింఛన్ పంపిణీ ప్రారంభం



మార్టేరులో పింఛన్ పెంపు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పెనుమంట్ర: టీడీపీ ప్రభుత్వంలో అందరికీ సమాన హక్కులు కల్పించి స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇచ్చేవిధంగా గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం మార్టేరు గ్రామంలో వేణుగోపాల ఆడిటోరియంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆచంట నియోజకవర్గంలోనే 29,827 మందికి రూ.19.65 కోట్లను పింఛన్లుగా సోమవారం నుంచి అందజేస్తామన్నారు. అనంతరం వికలాంగులకు పెన్షన్ పెంపు ధ్రువపత్రాలను అందజేసారు. పెనుమంట్ర ఎంపీడీవో పి పద్మజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్టేరు, నెగ్గిపూడి సర్పంచ్‌లు మట్టాకుమారి, మామిడిశెట్టి ధనలక్ష్మి, ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగమర్తి కృష్ణకుమారి పాల్గొన్నారు.

మార్టేరులో పూజలు

ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులు ఆదివారం మార్టేరులోని శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాలలో జరిగిన ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని ఉల్లంపర్రులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై డి.హరికృష్ణ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1230 స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.

150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఏపీఐఎస్ ఆసుపత్రి సహకారంతో వెరికోస్ వెయిన్స్, దీర్ఘకాలిక మోకాలు, మరియు కీళ్ళ నొప్పులకు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రజని కన్సల్టెంట్ వారి పర్యవేక్షణలో 150మంది రోగుల కు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంత రం వెరికోస్ వ్యాధిపై అవగాహన కల్పించారు.